విద్యార్థులకు పరీక్ష కిట్ల అందజేత



జగద్గిరిగుట్ట: విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పే బ్యాక్ టు ది సొసైటీ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. వార్షిక పరీక్షల దృష్ట్యా ప్యాడ్, పౌచ్, పెన్ను, స్కేల్ తదితర పరీక్ష కిట్‌ను జగద్గిరిగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 150 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పే బ్యాక్ టు ది సొసైటీ అధ్యక్షులు పీతల కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షా సమయంలో కష్టపడి చదవడంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుభాష్ చంద్ర బోస్ రెడ్డి, నాగేశ్వర్ రావు, శాంసన్, వీరయ్య, అబ్రహం, పరషురాం, రాజ్ కమల్, ఏడుకొండలు, గౌతమ్, వంపు మల్లేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

జగద్గిరిగుట్ట: పది మందికి అన్నం పెట్టాలనే అన్నదాన కార్యక్రమం ప్రారంభించామని హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ చైర్మన్ కన్నెకంటి లక్ష్మణ్, ప్రెసిడెంట్ కల్యాణ్ రావు పాటిల్ అన్నారు. చింతల్‌లో, శ్రీసాయి కాలనీ అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

నిజాంపేట్: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం దహనం చేయనున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్, మండల, మున్సిపల్, కార్పొరేషన్ కేంద్రాలలో ఉదయం 10:30 గంటలకు దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.

నీటి ఎద్దడి నివారించాలి

మూసాపేట: వివిధ డివిజన్‌లలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ అన్నారు. భరత్‌నగర్ కాలనీ, జేపీ నగర్, ఎస్పీ నగర్ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు, జలమండలి అధికారులు డీజీఎం శివ, మేనేజర్ జెక్కిలతో కలిసి మంచినీటి సమస్యపై శనివారం పర్యటించారు. లో ప్రెషర్‌తో మంచి నీరు వస్తుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. నీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రణాళికలతో ముందుకెళ్లాలన్నారు. జేపీ నగర్ కాలనీలో 20 అడుగుల వరకు మూడు 900 డయా పైపులైన్లు వేస్తే మంచినీటి సమస్య పోతుందని కాలనీ వాసులు ఆయన దృష్టికి తెచ్చారు. రెండు, మూడు రోజుల్లో పైపు లైన్లు మార్చి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జేపీ నగర్, ఎస్పీ నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

53 పరీక్షా కేంద్రాలు..
12,672 మంది విద్యార్థులు

- పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- కేంద్రాలను పరిశీలించిన అధికారులు
- విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు



పదో తరగతి విద్యార్థులు

దుండిగల్: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముందుగానే పరీక్షా కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులకు అనువుగా ఉండే పాఠశాలలనే కేంద్రాలుగా ఎంపిక చేశారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు జరిగే పరీక్షల కోసం అధికారులు సన్నద్ధమయ్యారు.

మొత్తం 53 సెంటర్లు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 53 సెంటర్లను ఏర్పాటు చేశారు. మొత్తం 12,672 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 2 వేల మంది, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 10, 672 మంది ఉన్నారు. ఒక్కో కేంద్రంలో 220 నుంచి 240 మంది వరకు పరీక్ష రాయనున్నారు.

ప్రత్యేక అధికారుల నిఘా

నియోజకవర్గంలో మొత్తం 53 సెంటర్లు ఏర్పాటు చేయగా.. ఒక్కో కేంద్రానికి చీఫ్ సూపర్‌వైజర్ చొప్పున 53 మంది అధికారులు, 53 డిపార్ట్‌మెంటల్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. వీరిపై మూడు ఫ్లైయింగ్ స్కాడ్ బృందాలు పర్యవేక్షిస్తాయి. ఒక్కో కేంద్రానికి 14 మంది ఇన్విజిలేటర్ల చొప్పున 53 సెంటర్లకు 742 మంది పని చేయనున్నారు.

ఇబ్బందులు లేకుండా ..

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యా శాఖ, ఆయా పాఠశాలల యాజమాన్యాలు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఎండాకాలం నేపథ్యంలో గాలి, వెలుతురుతో పాటు ఫ్యాన్ సౌకర్యాలను ఏర్పాటు చేశారు. మంచి నీటి వసతితో పాటు మూత్రశాలలను శుభ్ర పరిచారు.

దగ్గరలోనే కేంద్రం..

గతంలో మాదిరిగానే ఈ సంవత్సరం కూడా జంబ్లింగ్ పద్ధతిని కొనసాగించనున్నారు. ఒక పాఠశాలకు చెందిన విద్యార్థులు మరో పాఠశాల సెంటర్‌కు వెళ్లి పరీక్ష రాయాల్సి ఉంటుంది. అయితే విద్యార్థి చదువుతున్న పాఠశాల నుంచి కేవలం 2 నుంచి మూడు కిలో మీటర్ల మేర వరకు దూరంలో ఉన్న పాఠశాలను కేంద్రంగా ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. సమయభావం తక్కువగా ఉండడం, ట్రాఫిక్‌కు అంతరాయం లేకపోవడంతో విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకుని పరీక్షలకు హాజరయ్యే అవకాశం ఉంది. విద్యార్థులకు విద్యా శాఖ అధికారులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ముందస్తుగా పలు సూచనలు, జాగ్రత్తలు వివరించారు.

- ఒక రోజు ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలన్నారు.
- పరీక్ష ప్రారంభానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని సూచిస్తున్నారు.
- పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకు సడలింపు ఇస్తూ విద్యార్థులను లోనికి అనుమతి ఇస్తామని, సమయం మించిన విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమని అధికారులు పేర్కొంటున్నారు.
- పరీక్షా కేంద్రానికి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని తెలిపారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి



ఇప్పటికే పదవ తరగతి పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాం. విద్యా శాఖ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ కేంద్రాలను పర్యవేక్షిస్తారు. ఎవరైనా మాస్ కాపియింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– జెమినికుమారి, కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారిణి

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మణ్



సర్వే నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ప్రజా సమస్యలపై శనివారం కళావతినగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం బుట్ట దాఖలు చేసిందని, ఇండ్లు, ఇళ్ల స్థలాలు పెన్షన్లు, రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఇంటింటి సర్వే నిర్వహించి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సంజయ్ గాంధీనగర్ ప్రాంతంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. నాలుగైదు రోజులకోమారు సమయపాలన లేకుండా జలమండలి అధికారులు తాగునీటిని సరఫరా చేస్తున్నారని, సమీపంలోనే జలమండలి కార్యాలయం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు స్వాతి, కే శీను, సంతోష్, సత్యం సాయి, ముని, యాదగిరి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షాపులపై కేసు నమోదు

రూ.17 వేల విలువల గల బాటిళ్లు స్వాధీనం

నిజాంపేట్ : అక్రంగా మద్యం విక్రయిస్తున్న 3 బెల్టు షాపులపై బాచుపల్లి పోలీసుల కేసు నమోదు చేసి రూ. 17 వేల విలువగల 95 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బాచుపల్లి సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హోలి సందర్భంగా మద్యం అక్రమ అమ్మకాలను అరికట్టడానికి ముందస్తు చర్యగా విశ్వసనీయ సమాచారం మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాము. అధిక ధరలకు విక్రయిస్తున్న అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ మొత్తం రూ.17 వేలు ఉంటుందని తెలిపారు. 3 బెల్ట్ షాపుల యజమానులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వృద్ధులపై వీధి కుక్క దాడి





వీధి కుక్క దాడిలో గాయపడిన వృద్ధులు

చింతల్: వీధి కుక్క స్వైర విహారం చేసి అడ్డు వచ్చిన వారిని గాయపరిచిన సంఘటన చింతల్ డివిజన్ చంద్ర నగర్‌లో శనివారం సాయంత్రం జరిగింది. కొంత మంది వృద్ధ మహిళలు తమ ఇళ్ల ముందు కూర్చుని ఉండగా ఓ వీధి కుక్క నడుచుకుంటూ వెళ్తూ కూర్చున్న వారిపై దాడి చేసింది. ఇళ్ల ముందున్న వారితో పాటు ఆ దారి గుండా వెళ్తున్న వారిని సైతం తీవ్రంగా గాయపరిచింది. చంద్రనగర్‌లో మొత్తం ఏడుగురిని కరిచింది. ముగ్గురు మహిళలు సైతం ఉన్నారు. కుక్క కరిచిన వారంతా భయభ్రాంతులకు గురై ప్రాణాలు అరిచేతులో పెట్టుకొని అరుపులు కేకలు వేయడంతో స్థానికులు రోడ్డుపైకి వచ్చి వీధి కుక్కను తరిమి వేశారు. గాయాలైన వారు హాస్పిటల్‌లో చికిత్స చేయించుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని హాస్పిటల్లోనే అడ్మిట్ చేసుకున్నట్లు స్థానికులు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి



తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్

నిజాంపేట్: ఎస్సీ వర్గీకరణ తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను చేపట్టాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులు తోకల చిరంజీవి మాదిగ డిమాండ్ చేశారు. శనివారం బాచుపల్లి తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తే ఎస్సీ ఉద్యోగాలన్ని మాలలకే చెందుతాయని అన్నారు. మాదిగలకు ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వల్ల 70 ఏళ్లుగా ఉద్యోగ నియామకాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. మార్చి 17న ఎస్సీ వర్గీకరణ చట్టం అసెంబ్లీలో పెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారని, అప్పటి వరకు ఉద్యోగ పరీక్షల ఫలితాలు నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ, ముదిగొండ నవీన్, ప్రశాంత్, దుద్దెల హరి ప్రసాద్, అశోక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్ : కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి అన్నారు. బాచుపల్లి పరిసర ప్రాంత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో కలిసి శనివారం సనత్‌నగర్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సీఈఈని కలిసి వినతి పత్రం అందజేశారు. పారిశ్రామిక వాడల్లో విచ్చలవిడిగా రసాయనాలను కూడా పారబోస్తున్నారని తెలిపారు. అనంతరం సీఈఈ రఘు మాట్లాడుతూ.. తాము ప్రతిరోజు వివిధ ఫ్యాక్టరీలు తనిఖీ చేస్తున్నామని, వాటిలో లోపాలు గుర్తించామని తెలిపారు. విజిలెన్స్ టీంను సాయంత్రం 4 గంటల నుంచి రౌండ్స్ వేయుటకు ఆదేశించామని చెప్పారు. బాచుపల్లిలో రెండు చోట్ల ఎయిర్ క్వాలిటీ మెసర్‌మెంట్ సిస్టమ్‌ని ఒకటి హిల్ కౌంటీలో, రెండవది ప్రణీత్ లీఫ్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నిధులు మంజూరు చేసేలా కృషి

మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్



రోడామేస్త్రీనగర్‌లో పర్యటిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు శ్రీశైలంగౌడ్ అన్నారు. రోడామేస్త్రీనగర్, సుభాష్ నగర్‌లలో రోడ్ల ఏర్పాటుకు రూ.1.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. శనివారం ఆయన స్థానికంగా పర్యటించి మాట్లాడారు. గత ప్రభుత్వం కేవలం శంకుస్థాపనలకే అభివృద్ధి పనులను పరిమితం చేసిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సదరు పనులను పూర్తి చేయడమే కాకుండా కొత్త వాటిని ప్రారంభిస్తోందన్నారు. అనంతరం శానిటేషన్, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుచ్చిరెడ్డి, ఆరీఫ్ ఆంజనేయులు, నవీన్, బలరామ్, యాదగిరి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలి



ఆస్తి పన్ను రసీదు ఇస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ అన్నారు. శనివారం మున్సిపల్ సిబ్బంది పలు వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ పన్ను వసూళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొండి బకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశామని, ఆస్తి పన్ను చెల్లించకుంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అదే విధంగా హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు, చికెన్ మటన్ దుకాణదారులు ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, వార్డు ఆఫీసర్స్, బిల్ కలెక్టర్స్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాసన్ ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత గ్లకోమ పరీక్షలు



క్యాంప్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పీఎన్ఆర్ ఎంపైర్ కాంప్లెక్స్‌లోని వాసన్ ఐ కేర్ సెంటర్ ఆధ్వర్యంలో 'ఉచిత గ్లకోమ స్క్రీనింగ్ ప్రోగ్రాం' క్యాంప్‌ను శనివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్లకోమ అనేది చాలా ప్రమాదకరమని, 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ నెలాఖరు వరకు పరీక్ష ఉచితంగా చేయించుకోవటానికి అందుబాటులో ఉంటారన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డాక్టర్ రవికుమార్, గ్లకోమ డాక్టర్ మయూరి తదితరులు పాల్గొన్నారు.

టాయిలెట్లపై నీటి ట్యాంక్‌లు మాయం



రంగారెడ్డినగర్: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూత్రశాలల నిర్వహణను అధికారులు గాలి కొదిలేశారు. కొన్ని చోట్ల నీటి సదుపాయం లేక దుర్గంధంగా మారగా.. కొన్ని చోట్ల మూత్రశాలల పైభాగంలో ఏర్పాటు చేసిన నీటి నిల్వ టాంక్‌లు కనిపించడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన మూత్రశాల నీటి ట్యాంక్ మాయమైంది. దీంతో నీటి సదుపాయం లేకపోవడంతో సదరు మూత్రశాల వినియోగం లేకుండా పోయింది. అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు మూత్రశాల పక్కనే మూత్ర విసర్జన చేస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు మేల్కొని మూత్రశాలల వద్ద మాయమైన ట్యాంక్‌ల విషయమై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఓ వైపు వెలుగులు.. మరోవైపు చీకట్లు!



నిజాంపేట్‌లో పట్టపగలే వెలుగుతున్న స్ట్రీట్ లైట్



నెలల తరబడి వెలగని స్ట్రీట్ లైట్

నిజాంపేట్: పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్. స్వచ్ఛతలో అవార్డులు సాధించిన నిజాంపేట్‌లో కొన్ని ప్రాంతాల్లో నిత్యం విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉంటాయి. విద్యుత్‌ను ఆదా చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో ఆరు దాటితే అంధకారమే నెలకొంటోంది. ప్రధాన రహదారులు మొదలుకొని కాలనీలు, బస్తీలు అన్ని చోట్ల ఇదే పరిస్థితి. విజయపురికాలనీలో నిత్యం స్ట్రీట్ లైట్స్ పగలు కూడా వెలుగుతూనే ఉంటాయి. నల్లపోచమ్మ గుడి రోడ్డు ఇక్కడి ప్రధాన మలుపులో షాపులు వద్ద నెలల తరబడి స్ట్రీట్ లైట్స్ వెలగడం లేదు. స్థానికులు ఎన్నిసార్లు వినతలు ఇచ్చినా సంబంధిత అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు.

బీమాతో మహిళలకు భరోసా !

- మహిళా శక్తి పేరిట సంఘాలకు ప్రత్యేక రుణాలు
- ఉచిత రుణ, ప్రమాద బీమాతో ఆర్థికసాయం
- 18 నుంచి 60 ఏళ్ల లోపు ఉన్న వారికి వర్తింపు
- జీపీ, పురపాలికల్లోని 1,09,361 సభ్యులకు ప్రయోజనం



సాక్షి,సిటీబ్యూరో: మహిళా శక్తి పేరుతో ప్రత్యేక రుణాలు అందించడానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, వారి కోసం రెండు రకాల బీమా పథకాలను అమలులోకి తీసుకొచ్చింది. ఉచితంగా రుణ బీమాతో పాటు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. పొదుపు సంఘంలో రుణం తీసుకున్న మహిళ ప్రమాదవశాత్తు మరణిస్తే.. రుణమాఫీతో పాటు ప్రమాద బీమా ద్వారా ఆర్థికసాయం అందనుంది. ఈ బీమాతో గ్రామ పంచాయతీలతో పాటు పుర పాలక సంఘాల్లోని పొదుపు సంఘాల మహిళాసభ్యులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఈ రెండు రకాల బీమా పథకాలు కూడా అమలులోకి వచ్చాయి.

1.09 లక్షల మహిళా సభ్యులకు వర్తింపు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని రూరల్ ప్రాంతంలో 13 పురపాలక సంఘాలు ఉండగా, ఐదు మండలాల పరిధిలో 34 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలోని డీఆర్డీఏ, మెప్మా ఆధ్వర్యంలో 10,750 స్వయం సహాయక మహిళా సంఘాలు పనిచేస్తుండగా.. ఇందులో 1,09,361 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం అమలుచేయనున్న రెండు బీమాలు ప్రయోజనాన్ని చేకూర్చనున్నాయి.

72,450 మంది సభ్యులు

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో 5 మండలాలకు ఒక జిల్లా సమాఖ్య, 5 మండల సమాఖ్యలు, 3,395 స్వయం సహాయక మహిళా సంఘాలు ఉండగా.. వీటి పరిధిలో 36,911 మంది సభ్యులు ఉన్నారు.

- మెప్మా ఆధ్వర్యంలో 13 పురపాలక సంఘాల పరిధిలో 13 టౌన్ లెవల్ మహిళా సమాఖ్యలు, 208 ఏరియా లెవల్ మహిళా సమాఖ్యలు, 7,245 మహిళా సంఘాలు పనిచేస్తుండగా.. ఇందులో 72,450 మంది సభ్యులు ఉన్నారు.

చిరు వ్యాపారులకు రుణాలు

ఈ సంఘాల్లోని సభ్యులు చిరు వ్యాపారాలు చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, మహిళాశక్తి పథకాల ద్వారా వివిధ రుణాలను ప్రభుత్వం అందజేస్తోంది.

ప్రమాదబీమా రూ.10 లక్షలు

స్వయం సహాయక (పొదుపు) మహిళా సంఘాల మహిళలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10 లక్షల ఉచిత బీమా వర్తింపజేయనున్నారు. ఒకవేళ 100 శాతం వైకల్యం కలిగినా రూ.10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యం ఉంటే రూ.5 లక్షలు చెల్లిస్తారు. మృతిచెందిన మహిళకు పొదుపు అప్పు ఉంటే అది పూర్తిగా మాఫీ చేస్తారు.

సరైన ధృవీకరణపత్రాలు అందజేయాలి

గాయాలైన మహిళలకు అంగవైకల్యం తెలిపే ధ్రువీకరణ పత్రాలు, చికిత్స పొందిన ఆసుపత్రి పత్రాలు సమర్పించాలి. మరణించిన వారి పోస్టుమార్టం నివేదిక, పోలీసుల పరిశోధన నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. 18 నుంచి 60 ఏళ్లున్న మహిళలకు మాత్రమే ఇది వర్తింపజేస్తారు.

క్షేత్రస్థాయిలో అవగాహన లేదు

బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడం లేదు. ఈ రెండు పథకాల్లో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపుల వారు నెలవారీ సమావేశాలు నిర్వహించాలి. వాటికి సంబంధించిన వివరాలు మినిట్స్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. ఇలాంటి వాటిపై మహిళల్లో పూర్తిస్థాయిలో అవగాహన లేదు. చాలా గ్రూపుల్లో నెలవారీ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదు. దీనిపై సెర్ప్, మెప్మా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

ఎంతో ప్రయోజనం

మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న వారికి రెండు రకాల బీమా సౌకర్యం కల్పించడంతో ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయంతో సభ్యుల కుటుంబాలకు రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. దీనిపై మహిళా సంఘాలకు అవగాహన కల్పించేలా సంబంధిత శాఖలు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.